
సాక్షి ఒడిశా
సోమవారం । 18 । డిసెంబర్ । 2023



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు
నగదు - రూ. 5,80,726
వెండి - 63 గ్రాముల 800 మిల్లీ గ్రాములు
- భువనేశ్వర్/పూరీ



ప్రదర్శనలు అదుర్స్
మల్కన్‌గిరిలో జరుగుతున్న మల్యావంత్ ఉత్సవాలు రెండో రోజూ కొనసాగాయి. కళాకారులు అదరగొట్టారు.
- 8లో



చొయితి క్రీడోత్సవాలు ప్రారంభం
రాయగడలో ఈ నెల 26 నుంచి జరగనున్న చొయితి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మినీ మారథాన్ నిర్వహించారు.
- 8లో

న్యూస్‌రీల్

వృద్ధుడి హత్య కేసులో నిందితుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సార్వణ్ వివేక్

బరంపురం: గాంధీనగర్ 2వ లైన్‌లో ఈ నెల 11న వృద్ధుడు రోంకొ సెఠి (67)ని హత్య చేసిన నిమ్మఖండికి చెందిన బపిని సాహును అరెస్టు చేసినట్లు బరంపురం ఎస్పీ సార్వణ్ వివేక్ శనివారం తెలిపారు. ఘటన జరిగిన వెంటనే టౌన్ పోలీసు స్టేషన్ ఐఐసీ సురేష్ మహాపాత్రో బృందం సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు చెప్పారు.

ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక



కొత్తగా ఏర్పడిన క్లబ్ కార్యవర్గ సభ్యులు

రాయగడ: స్థానిక ప్రెస్‌క్లబ్‌కు నూతన కార్యవర్గం ఏర్పాటైంది. రాణిగుడఫారంలోని క్లబ్ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో క్లబ్ అధ్యక్షులుగా జోగేశ్వర్ దాస్, ఉపాధ్యక్షులుగా సీహెచ్ శ్రీనివాసరావు, సాధారణ కార్యదర్శిగా రంజన్ కుమార్ రథ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా శివ సాయి బక్షీపాత్రొ, సహ కార్యదర్శిగా ఆశీష్ రంజన్ పండా, కోశాధికారిగా సింహాచల్ పండా, ముఖ్యసలహాదారునిగా కె.కె.జెన్నా నియమితులయ్యారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకుల దుర్మరణం



ప్రమాద స్థలంలో వాహనాలు

జయపురం: బొయిపరిగుడ సమితి పెట్ట ఘాటీపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రీ కొడుకులు దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లమతాపుట్ సమితి ఉర్దిగుడ గ్రామానికి చెందిన డొంబురు కిరసాని అతడి ఐదేళ్ల కుమారుడు శ్రీతమ్ కిరసానిలు ద్విచక్ర వాహనంపై జయపురం వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా పెట్ట ఘాట్‌పై లమతాపుట్ నుంచి జయపురం వెళ్తున్న వ్యాన్ ఢీకొట్టింది. ఈ ఘటనలో డొంబురు అక్కడికక్కడే మరణించగా.. తీవ్రంగా గాయపడిన శ్రీతమ్‌ను స్థానికులు లమతాపుట్‌లోని ఆశాకిరన్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కొరాపుట్ సహిద్ లక్ష్మణ వైద్య కళాశాల ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. రాణితోట, బొయిపరిగుడ పోలీసుస్టేషన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి పంపించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్టు



పట్టుబడిన అజయ వర్మతో అబ్కారీ పోలీసులు

జయపురం: ఉత్తరప్రదేశ్‌కు గంజాయిని తరలిస్తున్న ముగ్గుర్ని జయపురం అబ్కారీ పోలీసులు అరెస్టు చేసినట్లు అబకారి అధికారి దుర్గాదల్ బిశ్వాల్ ఆదివారం వెల్లడించారు. ఏఎస్‌ఐ ప్రదీప్‌కుమార్ దొలై, సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ చేస్తుండగా జాతీయ రహదారిలో రైల్వే జంక్షన్ వద్ద అజయ వర్మ అనుమానాస్పదంగా కనిపించాడు. అతడిని విచారించగా తాను రాయ్‌పూర్ వెళ్లేందుకు బస్సు కోసం వేచి ఉన్నానని చెప్పాడు. అనుమానం వచ్చి బ్యాగు తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. వెంటనే అబ్కారీ కార్యాలయానికి తీసుకొచ్చి ప్రశ్నించగా తాము ముగ్గురం వచ్చామని, మిగతా ఇద్దరు కొన్నిచోట్ల బస్సుల కోసం వేచి ఉన్నారని చెప్పాడు. వెంటనే ఓఐసీ నీలాద్రి బిహారి మిశ్ర, కొట్‌పాడ్ ఓఐసీ తేజశ్వణీ ప్రధాన్‌లకు సమాచారం అందించి తనిఖీలు చేయగా రొండాపల్లి జంక్షన్ వద్ద సూరజ్ , నువాగాం జంక్షన్ వద్ద ఆసిఫ్‌ను పట్టుకున్నారు. వీరంతా ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అబాసకెడ గ్రామానికి చెందినవారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.లక్షా 65 వేలు ఉంటుందని చెప్పారు. కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

రహోగిరి అదరహో..!



గజపతి కట్టప్ప వేషంలో శిశిరో గాడో

పర్లాకిమిడి పట్టణంలోని రాజవీధిలో గజపతి ఉత్సవాల నేపథ్యంలో స్థానిక కళాకారులు ఆదివారం 'రహోగిరి' పేరిట ప్రత్యేక ప్రదర్శనలు నిర్వహించారు. పర్లాకిమిడి పురపాలక సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవాలను జిల్లా కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఒడిస్సీ, జానపద, లోకనృత్య కళాకారులు, చేతివృత్తుల ప్రదర్శనలతో పాటు యోగా, తైక్వాండో విన్యాసాలు, శాక్సోఫోన్‌లో ఔత్సాహిక గాయనీ గాయకులు గీతాలాపనలు, ఒడిస్సీ నృత్యంలో బాలబాలికల డ్యాన్సులతో హోరెత్తించారు. ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకూ రహదారిపై అద్భుత విన్యాసాలు, ప్రదర్శనలో అలరించారు.

– పర్లాకిమిడి



బెర్హావీధి సమర యోధుల కత్తిసాము



శాక్సోఫోన్‌లో గీతాలు పలికిస్తున్న విద్యార్థులు



ఒడిస్సీ నృత్యంలో బాల కళాకారులు



సవరనృత్యం చేస్తున్న విద్యార్థులు



రహోగిరి ఉత్సవాల్లో పర్లాకిమిడి పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెట్టి



యోగాసనాలు



తైక్వాండో విద్యార్థుల ప్రదర్శన



ఒడిస్సీ కళా ప్రదర్శనలో విద్యార్థినులు



సంబల్‌పురి నృత్యం



గీతాలు ఆలపిస్తున్న ఔత్సాహిక గాయకులు

సాక్షి గోపాల్ ఆలయంలో చోరీ

- నిందితుల అరెస్టు
- నగదు, ఆభరణాలు స్వాధీనం



పోలీసుల అదుపులో నిందితులు



స్వాధీనపరచుకున్న చోరీ సొత్తు

భువనేశ్వర్: సాక్షి గోపాల్ ఆలయంలో శనివారం రాత్రి దుండగులు చొరబడి బంగారు ఆభరణాలు, నగదు దోచుకున్నారు. ఆదివారం ఉదయం విషయం వెలుగు చూడటంతో సత్యబాది ఠాణా పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. 12 గంటల వ్యవధిలోనే నిందితుల్ని అదుపులోకి తీసుకుని చోరీ సొత్తు, నగదు స్వాధీనపరచుకున్నారు. వివరాల్లోకి వెళ్తే..సేబక్ సాహి సాక్షి గోపీనాథ్ ఆలయ ప్రాంగణంలోని మదనమోహన్ ఆలయంలో శనివారం అర్ధరాత్రి దుండగులు చొరబడ్డారు. తాళం పగులగొట్టి ప్రాంగణంలో ఉన్న రెండు హుండీల్లో నగదును అపహరించారు. హుండీలను ఆలయంలోని వంట గది వద్ద పడేసి దోచుకున్న నగదు, ఆభరణాలు మూటగట్టుకుని పారిపోయారు. ఈ సమగ్ర ప్రక్రియ సీసీటీవీలో రికార్డయ్యింది. దీని ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టడంతో ఇద్దరు దుండగులు ఈ చర్యకు పాల్పడినట్లు గుర్తించారు. సత్యబాది ఠాణా ఇన్‌స్పెక్టర్ ఇన్‌చార్జ్ (ఐఐసీ) బిజయ్ బెహరా, సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ (ఎస్‌డీపీఓ) బిరాంచి పతి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం దర్యాప్తు చేపట్టి దుండగుల్ని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ. 67,000 నగదు, బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు.

కాంగ్రెస్ విజయం ఖాయం



మాట్లాడుతున్న పీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ బంకనిధి బెహరా

రాయగడ: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికార పగ్గాలు చేపట్టడం ఖాయమని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ చైర్మన్ బంకనిధి బెహరా ధీమా వ్యక్తం చేశారు. రాయగడలోని కాంగ్రెస్ భవన్‌లో డీసీసీ అధ్యక్షుడు బిజయ్ గొమాంగో ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన నేతృత్వ వికాస్ మిషన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. రాయగడ, గుణుపూర్ శాసనసభ నియోజకవర్గాలకు చెందిన పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్న ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలొ ఈసారి కాంగ్రెస్‌కు అనుకూల పవనాలు వీస్తున్నాయని చెప్పారు. అందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలన్నారు. పీసీసీ అధ్యక్షుడు శరత్ పట్నాయక్ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ నేతృత్వ వికాస్ మిషన్ పేరిట సమావేశాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. రెండు దశాబ్దాలుగా రాష్ట్రం అన్ని రంగాల్లో పూర్తిగా వెనుకబడిందని, అధికార బీజేడీ నాయకులు స్వప్రయోజనాలకు మాత్రమే పదవులు వినియోగించుకుంటూ ప్రజలను మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. త్వరలో ఇందిరమ్మ రాజ్యం రానుందని చెప్పారు. కార్యక్రమంలో కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉలక, పీసీసీ సాధారణ కార్యదర్శి దుర్గాప్రసాద్ పండ, ఓబీసీ జాతీయ కో ఆర్డినేటర్ రాజ్‌కిషోర్ బారిక్, సీనియర్ నాయకుడు అప్పలస్వామి కద్రక తదితరులు పాల్గొన్నారు.

ధనుర్మాస వైభవం

- నెలగంటు ప్రారంభం
- వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు



నెలగంటకు పూజలు చేస్తున్న భక్తులు



పూజలందుకుంటున్న వేంకటేశ్వర స్వామి



మత్స్య అవతారంలో వేంకటేశ్వరుడు

పర్లాకిమిడి:

ధనుర్మాసం సందర్భంగా పర్లాకిమిడి కోమటి వీధిలోని వేంకటేశ్వర దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 5 గంటలకే శాస్త్రోత్తంగా పూజలు చేసి భక్తులకు హారతులు ఇచ్చి ప్రసాదం పంపిణీ చేశారు. సూర్యుడు ధనురాశిలో ప్రవేశించిన కారణంగా ధనుర్మాసం ప్రారంభమైందని, ప్రతిరోజు తిరుప్పావై ప్రవచనాలు చదువుతామని ఆలయ ప్రధాన అర్చకులు భద్రం శ్రీనివాసాచార్యులు తెలిపారు. కేవుటి వీధిలోని ప్రసన్న వేంకటేశ్వర ఆలయంలోనూ నెలగంటకు పూజలు చేసి భక్తులకు పొంగళి పంపిణీ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మత్స్య ఆకారంలో ఉన్న ప్రసన్న వేంకటేశ్వరుని దర్శించుకున్నారు. ఎ.రాజగోపాలచారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



వైకుంఠ ఏకాదశికి భారీ ఏర్పాట్లు



వైకుంఠ బాలాజీ దేవస్థానంలో వివరాలు వెల్లడిస్తున్న కార్యవర్గ సభ్యులు

భువనేశ్వర్: పవిత్ర వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని ఖరగ్‌పూర్ వైకుంఠ బాలాజీ దేవస్థానంలో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 23, 24 తేదీల్లో ఉత్సవాలు కొనసాగుతాయని కార్యవర్గ సభ్యులు తెలిపారు. దేవస్థానం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ సుప్రభాతం, తోమాల సేవ వంటి నిత్య సేవాదులతో పాటు 11 ప్రత్యేక వంటకాలతో మహా నైవేద్యం, ద్వాదశి అన్న ప్రసాదం, శ్రీ వారి వైకుంఠ హారతులు, సహస్ర దీపాలంకరణ, లక్ష సార్లు విష్ణు సహస్ర నామ పారాయణం, వరహాలక్ష్మి నృసింహ స్వామి కల్యాణోత్సవం వంటి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్ధ రాత్రి 1.30 గంటలకు దేవస్థానం ద్వారం తలుపులు తెరిచి రాత్రి 10 గంటల వరకు నిరవధికంగా వైకుంఠ ఏకాదశి, ద్వాదశి పూజాదులు కొనసాగుతాయని వివరించారు.

క్లుప్తంగా

మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో కిశోర్‌చంద్ర రథ్‌కు స్వర్ణం



పతకాలతో కిశోర్‌చంద్ర రథ్

పర్లాకిమిడి: గజపతి జిల్లా అబ్కారీశాఖ విశ్రాంత ఎస్సై కిశోర్‌చంద్ర రథ్ న్యూఢిల్లీలో జరుగుతున్న 3వ ఖేలో మాస్టర్ అథ్లెటిక్స్‌లో సత్తాచాటారు. వందమీటర్ల హర్డిల్స్‌లో స్వర్ణ పతకం, రిలే, లాంగ్ జంప్, ట్రిపుల జంప్ ఈవెంట్‌లో కాంస్య పతకాలు సాధించారు. ఈయన విజయం పట్ల కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రదోష్ కుమార్ శెఠి, అభిరాం బెహరా హర్షం వ్యక్తం చేశారు.

బొయిపరిగుడలో రక్తదానం



రక్తదానం చేస్తున్న బీఎస్ఎఫ్ జవాన్లు

జయపురం: స్థానిక బొయిపరిగుడలో అమొ ఒడిశా, బీఎస్ఎఫ్ బెటాలియన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 115వ బెటాలియన్‌లో 180 మంది జవాన్లు, స్థానిక యువకులు రక్తదానం చేశారు. అంతకుముందు ఈ శిబిరాన్ని బెటాలియన్ సెకెండ్ ఇన్ కమాండెంట్ కైలాశ లుఖ ప్రారంభించారు. కార్యక్రమంలో బొయిపరిగుడ కమ్యూనిటీ హాస్పిటల్ డాక్టర్ అధిరాజ్ సాహు తదితరులు పాల్గొన్నారు.

పేపర్‌మిల్లు కార్మికులను ఆదుకోండి



ఆందోళన చేస్తున్న కార్మికులు

జయపురం: గగణాపూర్‌లోని సేవా పేపరు మిల్లును పూర్తి స్థాయిలో నడిపి కార్మికులను ఆదుకోవాలని శ్రామిక సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. మిల్లు ప్రాంగణంలో యూనియన్ల కోఆర్డినేషన్ కమిటీ కార్యదర్శి, ప్రముఖ కార్మిక నేత ప్రమోద కుమార్ మహంతి నేతృత్వంలో శ్రామికులు ఆందోళన చేపట్టారు. సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు.

తరుణ ప్రజ్ఞాభారతి సంస్థ సేవలు భేష్



సాహితీవేత్త చంద్రమణి బారిక్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

జయపురం: ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలు, కళల పరిరక్షణలో జయపురం తరుణ ప్రజ్ఞాభారతి సంస్థ సేవలు అభినందనీయమని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి అన్నారు. స్థానిక సంధ్యా ఫంక్షన్ హాలులో ఆదివారం తరుణ ప్రజ్ఞా భారతి 35వ వార్షికోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో తరుణ ప్రజ్ఞాభారతి అధ్యక్షులు లక్ష్మీకాంత మిశ్ర, సాధారణ కార్యదర్శి యజ్ఞేశ్వర పండా, ఆదివాసీ సంస్కృతి పరిశోధకులు పరేష్ రథ్, జయపురం బ్లాక్ ఎడ్యుకేషనల్ అధికారి చంద్రకుమార్ నాయిక్, హేమంత కుమార్ చాంద్, ప్రమోద్ రౌళో తదితరులు పాల్గొన్నారు.

అతివేగం ఆయువు తీసింది

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని ఉమెన్స్ కాలేజీ రోడ్డులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పా లకొండ మండలం కొండాపురం గ్రామానికి చెందిన బలగ రాంబాబు(22) దుర్మరణం పాలయ్యాడు. ట్రాఫిక్ ఎస్ఐ రామారావు తెలిపిన వివరాల మే రకు.. రాంబాబు స్థానిక ఆర్ట్స్ కాలేజీలో డిగ్రీ పూర్తి చేసి ఇక్కడే హాస్టల్‌లో స్నేహితులతో ఉంటూ కలిసి పోటీ పరీక్షలకు ప్రిపేరవుతున్నాడు. ఈ నేపథ్యంలో పాలకొండ మండలం బుక్కూరు గ్రామానికి చెందిన తన స్నేహితుడు అంపిలి చంద్రశేఖర్ చర్చికి పిలవడంతో అతనితో పాటు వుమెన్స్ కాలేజీ రోడ్డులో ఉన్న చర్చికి వెళ్లాడు. ప్రార్థన ముగిసిన అనంతరం రాంబాబు స్నేహితుడి బైక్ తీసుకుని 80 ఫీట్ రోడ్డు వరకు షికారుకు వెళ్దామని బయల్దేరాడు. చంద్రశేఖర్ డ్రైవింగ్ చేయగా రాంబాబు వెనుక కూర్చు న్నాడు. కొద్ది దూరం వెళ్లే సరికి సడెన్ బ్రేక్ వేయడంతో వెనుక కూర్చున్న రాంబాబు తుళ్లి రోడ్డుపై పడిపోయాడు. దీంతో తలకు బలమైన గాయమై చెవి, నోటి నుంచి రక్తస్రావమైంది. చంద్రశేఖర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల సాయంతో రాంబాబును రిమ్స్‌కు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. యువకుడి తల్లిదండ్రులు బలగ అప్పారావు, రామలక్ష్మి నిరుపేద కుటుంబానికి చెందిన వారు. వీరు హైదరాబాద్‌లో వలస కూలీలుగా పనిచేస్తున్నారు. కుమారుడి మృతి వార్త తెలిసిన వెంటనే వారు ఇక్కడకు బయల్దేరారు. మృతుడి పెద్దనాన్న బలగ సూర్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రామారావు చెప్పారు.

ప్రదర్శనలు అదుర్స్

మల్కన్‌గిరి జిల్లాలో జరుగుతున్న మల్యావంత్ మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు కూడా ప్రదర్శనలు అదరహో అనిపించాయి. కొరాపుట్ డీఐజీ చరణ్ సింగ్ మీనా ముఖ్య అతిథిగా హాజరై జగన్నాథుని విగ్రహం వద్ద జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. మల్కన్‌గిరి జిల్లా కలెక్టర్ విశాల్‌సింగ్, జిల్లా వైద్యాధికారి ప్రఫుల్లకుమార్ నాందో, జిల్లా అదనపు కలెక్టర్ వెద్బర్ ప్రధాన్, డీఐపీఆర్ఓ ప్రమిళా మాఝి తదితరులు హాజరయ్యారు. ఆల్ ఒడిశా మార్షల్ ఆర్ట్స్ బృందం ప్రదర్శన, ఉత్తరప్రదేశ్ మయూరి నృత్యం, అస్సాం భీయు నృత్యం, పూరి మల్కాం ప్రదర్శన, మల్కన్‌గిరి దురువ ఆదివాసీ నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

– మల్కన్‌గిరి



రాధారాదే నృత్యం



మల్కన్‌గిరి దురువ నృత్యం



కటక్ మోహిర్ నృత్య ప్రదర్శన



అస్సాం భీయు నృత్య ప్రదర్శన



డీఐజీ చరణ్‌సింగ్ మీనాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ విశాల్ సింగ్



నవరంగ్‌పూర్ ఆదివాసీ నృత్యం

చొయితి క్రీడోత్సవాలు ప్రారంభం



మినీ మారథాన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సరక, ఎమ్మెల్యే ముదులి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న పాత్రో, సేనాపతి

రాయగడ: స్థానిక గోవిందచంద్ర దేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో ఈ నెల 26 నుంచి జరగనున్న చొయితి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మినీ మారథాన్ నిర్వహించారు. రాష్ట్ర ఆదివాసీ, ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరక ముఖ్యఅతిథిగా, రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి గౌరవ అతిథిగా హాజరై పచ్చ జెండా ఊపి పరుగు ప్రారంభించారు. రిలయన్స్ బంక్ నుంచి పది కిలోమీటర్ల దూరంలో హలువ వరకు కొనసాగిన ఈ రేస్‌లో యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సరక మాట్లాడుతూ ఎప్పట్లాగే ఈ ఏడాది కూడా చొయితి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఆదివాసీల భాష, సంస్కృతి, కళలను పరిరక్షించేందుకే ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విజేతల వివరాలు వెల్లడించారు. పురుషుల విభాగంలో బిడిక సిద్దు ప్రథమ, ఘాసీరాం బారట్ ద్వితీయ, ఈశ్వర్ హికక తృతీయ, శ్రీకాంత్ ప్రష్కా, సిన్నారాం ప్రష్కా, శ్రీధర్ పిడికక, రాజాన ధొని, శంకర్ ప్రష్కా, మిన్నారావు ప్రష్కా, సచీంద్ర నాయక్‌లు ప్రోత్సాహక బహుమతులు గెలుచుకున్నారు. మహిళల విభాగంలో మాలతీ మాఝి ప్రథమ, స్వప్నా హికక ద్వితీయ, బిద్యుత్ ప్రభా తురక్ తృతీయ, సుమిత్ర కిలక, పింకి హిమిరిక, మధుమతి మినియాక, ప్రచాతి తున, గీతా కులిసిక, శుభద్ర కద్రకలు ప్రోత్సాహక బహుమతులు సాధించారు. కార్యక్రమంలో ఏఎస్పీ విష్ణు చరణ్ పాత్రో, ఎస్‌డీపీఓ రస్మీరంజన్ సేనాపతి తదితరులు పాల్గొన్నారు.

డాబుగాంలో ఆరోగ్యమంత్రి పర్యటన



టెమరా వద్ద పర్యటిస్తున్న ఆరోగ్య మంత్రి నిరంజన్ పూజారి, ఎంపీ రమేష్ మఝి, ఎమ్మెల్యే మనోహర్ రంధారి



హాజరైన ప్రజలు

కొరాపుట్: రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి నిరంజన్ పూజారి ఆదివారం నబరంగ్‌పూర్ జిల్లా డాబుగాం నియోజకవర్గంలో పర్యటించారు. పపడాహండి సమితి కుటుబాయి పంచాయతీ బండారిగుడ గ్రామంలో ఓల్మా నుంచి మటియా గుడ మధ్య వంతెన నిర్మాణానికి శిలా ఫలకం ఆవిష్కరించారు. అనంతరం డాబుగాం సమితి గోడకుంటా గ్రామంలో అత్తిగాం–పరియాబెడా మధ్య వంతెన నిర్మాణానికి భూమి పూజ చేశారు. తిరిగి పపడాహండి సమితి కొడకుంటా చేరుకుని జబాబల్ ప్రాంతంలో టురి నదిపై వంతెన నిర్మాణ పనులు ప్రారంభించారు. కొసాగుమ్డ సమితి టెమరా వద్ద గయిజోడి నాలాపై వంతెన నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో నబరంగ్‌పూర్ పార్లమెంట్ సభ్యుడు రమేష్ చంద్ర మఝి, డాబుగాం ఎమ్మెల్యే మనోహర్ రంధారి తదితరులు పాల్గొన్నారు.

పూరీ జగన్నాథ ఆలయంలో భక్తుడు మృతి

భువనేశ్వర్: పూరీ జగన్నాథ ఆలయంలో ఆదివారం ఓ భక్తుడు గుండెపోటుతో మృతి చెందాడు. మధ్యాహ్నం ప్రధాన ఆలయంలో మూల విరాట్టులు జగన్నాథుడు, బలభద్రుడు, దేవీ సుభద్ర దర్శనం చేసుకుని ప్రధాన దేవస్థానం సముదాయంలో తిరుగాడుతుండగా విశ్వనాథుని ఉప ఆలయం ఆవరణలో స్పృహ తప్పి పడిపోయాడు. విషయం తెలియడంతో దేవస్థానం వర్గాలు హుటాహుటిగా ఆయన్ను జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

రాష్ట్రమంతా చలి పులి!

భువనేశ్వర్: రాష్ట్రం అంతటా చలి, పొడి వాతావరణం నెలకొంది. గత 24 గంటల్లో దక్షిణ మారు మూల ప్రాంతాలు కొరాపుట్, కంధమాల్ జిల్లాల్లో ఒకటి రెండు చోట్ల దట్టమైన పొగ మంచు, కలహండి, కెంజొహర్ జిల్లాల్లో ఒకటి, రెండు చోట్ల తేలికపాటి పొగ మంచు కమ్ముకుంది. రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల్లో కనిష్ట ఉష్ణోగ్రతల్లో ఎటువంటి మార్పు లేదని స్థానిక భారత వాతావరణ శాఖ (ఐఎండీ) సమాచారం . మారుమూల, అంతర్గత, కోస్తా జిల్లాల్లో ఒకటి, రెండు చోట్ల సాధారణం కంటే తక్కువగా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పర్లాకిమిడిలో అత్యధిక గరిష్ట ఉష్ణోగ్రత 30.4 డిగ్రీల సెల్సియస్, ఫుల్బాణిలో అత్యల్ప కనిష్ట ఉష్ణోగ్రత 8.0 డిగ్రీల సెల్సియస్ నమోదయ్యాయి. కిరైలో 8.2, జి.ఉదయగిరిలో 8.6, రౌర్కెలాలో 8.8, అంగుల్‌లో 9.0, రాణితాల్‌లో 9.4, దారింగిబాడిలో 9.5, సుందరగడ్‌లో 9.5, కెంజొహర్‌లో 9.6, ఝార్సుగుడలో 9.8 చొప్పున కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

విప్లవ గీతాలతో హోరెత్తిన సూదికొండ కాలనీ

పలాస: పలాస సూదికొండ కాలనీలోని వీధులను అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య, ప్రజాకళామండలి కళాకారులు విప్లవ గీతాలతో ఆదివారం హోరెత్తించారు. పలాస మండలం బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరం వద్ద ఈ నెల 22న విప్లవ కవి సుబ్బారావు పాణిగ్రాహి 54వ వర్ధంతి సభను విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ మేరకు ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రచారం చేశారు. కార్యక్రమంలో అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, ప్రజాకళామండలి రాష్ట్ర సహాయక కార్యదర్శి కొర్రాయి నీలకంఠం, అరుణోదయ రాష్ట్ర కార్యదర్శి నిర్మల, రైతుకూలీ సంఘం రాష్ట్ర నాయకులు తాండ్ర ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కళాకారుల సంఘం ఏర్పాటు



అవిభక్త కొరాపుట్ జిల్లాల ఆదివాసీ కళాకార సంఘం సభ్యులు

• అవిభక్త కళాకారుల సంఘం ఏర్పాటు

జయపురం: అవిభక్త కొరాపుట్(కొరాపుట్, రాయగడ, మల్కనగిరి, నవరంగపూర్ జిల్లాలు)లో ఆదివాసీ కళాకారుల సంఘం ఆదివారం ఏర్పాటైంది. జయపురంలో దాదాపు 200 మంది ఆదివాసీ పాటల గాయకులు, నృత్య, నాట్య, వాయిద్య, సంగీత కళాకారులు, డైరెక్టర్లు కలిసి ఈ సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అధ్యక్షునిగా గణేష్‌చంద్ర బిశాయి, ఉపాధ్యక్షులుగా సుప్రిత్ సంతోష్ బొచ్చ, కార్యదర్శిగా సీతమ్ సామంతరాయ్, సహాయ కార్యదర్శిగా ధన హరిజన్, కోశాధిపతులుగా బేణుధర బిశాయి, అశోక్ కపూర్, సలహాదారులుగా రవీంద్ర మహరాణాలు నియమితులయ్యారు. కొరాపుట్ జిల్లా కార్యదర్శులుగా దామ హంతాల్, రాకేష పట్నాయక్, నవరంగపూర్ జిల్లా కార్యదర్శులుగా ఆనంద కుమార్ దాస్, సూర్య బెన్య, రాయగడ జిల్లా కార్యదర్శులుగా గుప్తేశ్వర సిక్కా, ప్రిన్స్ గుప్త, మల్కనగిరి జిల్లా కార్యదర్శులుగా జీవణ కుమార్, కుమొ ఖొరలను నియమించారు. నాలుగు జిల్లాల్లోనూ ఆదివాసీ కళాకారులను సంఘటిత పరిచేందుకు కృషి చేయాలని అధ్యక్షుడు గణేష్ చంద్ర బిశాయి పిలుపునిచ్చారు.

ముగిసిన సర్గిఫుల్లో ఉత్సవాలు



జానపద కళాకారులతో ప్రజాప్రతినిధులు, అధికారులు



రాయఘడ సమితిలో అశోక్ స్థూపాన్ని ఆవిష్కరించిన కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్, అధికారులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా రాయఘడ బ్లాక్‌లో మూడు రోజులుగా జరుగుతున్న జోనల్ స్థాయి సర్గిఫుల్లో (అడివి పూలు) ఉత్సవాలు–2023 ఆదివారంతో ముగిశాయి. ముగింపు వేడుకలకు రాష్ట్ర స్పెషల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ అబ్జర్వర్ ప్రదీప్ మఝి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. 710 మంది విద్యార్థులు, 125 మంది జిల్లా అసోసియేట్ రిసోర్సు పర్సన్లు, రాష్ట్ర కోఆర్డినేటరు ఫిరోజ్ ఖాన్ చింథానీ ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు. చివరి రోజు జానపద, లోకనృత్యంతో విద్యార్థులు అలరించారు. విజేతలకు ప్రశంసాపత్రాలు, మెమెంటోలు అందజేశారు. ప్రదీప్ మఝిని కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ దుశ్శాలువతో సన్మానించారు. అనంతరం రాయఘడ బ్లాక్ ఎస్ఎస్‌డీ ఉన్నత పాఠశాల ఆవరణలో అశోక్ స్థూపాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మోహనా ఎమ్మెల్యే దాశరథి గొమాంగో, డీఎఫ్ఓ సుబ్రహ్మణ్యం ఆనంద్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బిరేంద్ర కుమార్‌దాస్, డిప్యూటీ డైరెక్టర్ (సంక్షేమ శాఖ) సంతోష్ కుమార్ రథ్, సమగ్ర గిరిజనాభివృద్ధి శాఖ పీఓ ఫల్గుణీ మఝి, బీడీఓ రాయగడ తదితరులు పాల్గొన్నారు.

వర్ధమాన తరాలకు మార్గదర్శకం కావాలి



పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

భువనేశ్వర్: వర్ధమాన తరాలకు విద్యార్థులు మార్గదర్శులుగా నిలవాలని ఖుర్దారోడ్ రైల్వే పాఠశాల పూర్వ విద్యార్థి, భారత ప్రభుత్వ నీతీ ఆయోగ్ సభ్యుడు జగదానంద అన్నారు. ఖుర్దారోడ్ రైల్వే పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం (రోజా) 15వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ముందుగా 1973లో మెట్రిక్యులేషన్ ఉత్తీర్ణత పొందిన 50 ఏళ్ల నాటి పూర్వ విద్యార్థులను ప్రత్యేకంగా సత్కరించారు. ఈ ఏడాది వార్షికోత్సవానికి కొత్తగా 150 మంది పూర్వ విద్యార్థులు రోజా సంస్థలో చేరడం విశేషం. ఇటీవల దివంగతులైన ఉపాధ్యాయులకు మౌనంతో శ్రద్ధాంజలి ఘటించారు. ఇటీవల రిటైరైన ఉపాధ్యాయులకు జ్ఞాపికలతో సత్కరించారు. రోజా వార్షిక సంచిక అమొ స్కూలు (మన బడి) ఆవిష్కరించారు. రోజా అధ్యక్షుడు డాక్టరు ప్రసన్న కుమార్ మహంతి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్త డాక్టరు ప్రతిభా మహారథి, రైల్వే పాఠశాల ప్రిన్సిపల్ వినయ్ భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

అస్కాలో కార్తికేయ పాండ్యన్ పర్యటన



పాచిలిమాలో బిజూ పట్నాయక్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న కార్తికేయ పాండ్యన్



అస్కా సైన్స్ కళాశాల వార్షికోత్సవంలో ప్రసంగిస్తున్న కార్తికేయ

బరంపురం: ఒడిస్సా టి–5 ప్రత్యేక బృందం కార్యదర్శి కార్తికేయ పాండ్యన్ ఆదివారం అస్కాలో పర్యటించారు. శనివారం రాత్రి బరంపురంలోని మా బుడి శాంత అమ్మవారిని దర్శించుకుని ఆదివారం ఉదయం ఎంకేసీజీ ఆస్పత్రి ప్రాంగణంలో రింగ్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసారు. అనంతరం అస్కా పట్టణానికి చేరుకుని పాచిలిమా జంక్షన్‌లో దివంగత బిజు పట్నాయక్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అస్కా సైన్స్ కళాశాల వార్సికోత్సవాల్లో పాల్గొని ప్రసంగించారు. అనంతరం గంజాం జిల్లాలోని పులసర, కుదల, కభిసుర్యనగర్, ఛత్రపూర్, కల్లికోట్ నియోజకవర్గాల్లో పర్యటించి పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. అనంతరం భువనేశ్వర్ చేరుకున్నారు.

క్లుప్తంగా

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత



రాములమ్మకు చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు, వైస్ ఎంపీపీ అచ్చెన్నాయుడు తదితరులు

రాజాం: మండలంలోని చిన్నశిర్లాం గ్రామానికి చెందిన ఆవాల రాములమ్మకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.65లు మంజూరు కావడంతో పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కంబాల జోగులు ఆదివారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కును లబ్ధిదారుకు అందజేశారు. రాములమ్మ అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరి చికిత్స తీసుకుంది. చికిత్స కోసం చేసిన అప్పులు తీర్చేందుకు ఆర్థిక ఇబ్బందులు పడుతోంది. సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందించాలని దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వం రూ.65 వేలు మంజూరు చేసింది. కార్యక్రమంలో రేగిడి వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, చిన్నశిర్లాం పంచాయతీ సర్పంచ్ టంకాల ఉమాపాపినాయుడు, పార్టీ జిల్లా కార్యదర్శి తోలేటి రాజరత్నం మాస్టారు, మజ్జి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత సారాంశాన్ని తెలుసుకోవాలి



విజేతలతో పోటీల నిర్వాహకులు

రాజాం సిటీ: విద్యార్థులు భగవద్గీత సారాంశాన్ని తెలుసుకోవాలని వికాసతరంగిణి కేంద్ర సమితి కార్యనిర్వాహక కార్యదర్శి టీటీవీ రమణమూర్తి అన్నారు. స్థానిక వికాసతరంగిణి కార్యాలయంలో ఆదివారం రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు నాలుగు విభాగాల్లో భగవద్గీత 11వ అధ్యాయంపై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవద్గీతలోని శ్లోకాలను క్షుణ్ణంగా నేర్చుకున్నప్పుడే అందులోని పరమార్థం తెలుస్తుందన్నారు. ఈ పఠన పోటీల ద్వారా విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి మెరుగుపడుతుందన్నారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. వికాసతరంగిణి అధ్యక్షులు అమనాన నీలకంఠం, కోశాధికారి వాకచర్ల పైడిరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా టంకాల భారతి, అమనాన లలిత, ఎం.నాగలక్ష్మి, వి.భారతి, మామిడి రాధాకృష్ణలు వ్యవహరించారు.

ఇంటర్మీడియట్ పరీక్ష ఫీజు గడువు పెంపు

విజయనగరం అర్బన్: ఇంటర్మీడియట్ పరీక్ష ఫీజు చెల్లించడానికి గడువు పెడిగించినట్లు ఆర్‌ఐఓ మజ్జి ఆదినారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ కళాశాలలు, ఏపీఎంఎస్, ఏపీఎస్‌డబ్ల్యూఆర్, కేజీబీవీ, ఏపీఆర్‌జేసీ, ఎంజేపీబీపీ, బీసీ కళాశాల ఇంటర్మీడియట్ అభ్యర్థులు ఫీజు చెల్లించడానికి ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఈ నెల 20వ తేదీ వరకు గడువు పొడిగించారని తెలిపారు. అదే ప్రైవేట్ యాజమాన్య కళాశాల అభ్యర్థులకు రూ.200 అపరాధ రుసుంతో ఈనెల 20వ తేదీ వరకు గడువు పొడిగించారని పేర్కొన్నారు. ఈనెల 21 నుంచి 29వ తేదీ వరకు రూ.1000 అపరాధ రుసుంతో పరీక్ష ఫీజు చెల్లించడానికి గడువు ఉందన్నారు. హెచ్‌సీఎల్ టెక్ బీ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో విద్యార్థులందరూ పాల్గొనే విధంగా ప్రిన్సిపాల్స్ చర్యలు తీసుకోవాలని సూచించారు. 15వ తేదీన జరగాల్సిన ఈ పరీక్ష ఈ నెల 28వ తేదీకి వాయిదా పడిందని ఆ రోజు ఉదయం 10.30 నుంచి 11.30 గంటల మధ్యలో ఈ పరీక్ష ఆయా కళాశాలల్లో జరుగుతుందని పేర్కొన్నారు. కళాశాలకు సంబంధించిన యూడైస్ అప్‌డేట్ సమాచారాన్ని ఈ నెల 18లోపు ఆయా కళాశాల యాజమాన్యాలు పంపాలని ఆదేశించారు.

గ్రూప్-2 పరీక్షకు ఉచిత శిక్షణ

విజయనగరం అర్బన్: ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్షకు ఉచిత శిక్షణ కోసం అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని గురజాడ అప్పారావు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె.సందీప్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన 80 మంది అభ్యర్థులకు ఈనెల 27వ తేదీ నుంచి 50 రోజుల పాటు స్టైపెండ్, స్టడీ మెటీరియల్ ఇస్తామని పేర్కొన్నారు. ఉచిత శిక్షణకు డిగ్రీ ఉత్తీర్ణులైన వారిని మెరిట్ ప్రాతిపదికన ఎంపిక చేస్తామని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు బయోడేటాతో పాటు పది, డిగ్రీ మార్కుల లిస్టు, కుల ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు దరఖాస్తుతో జతజేయాలని సూచించారు. ఈ నెల 23వ తేదీలోగా దరఖాస్తులను అందజేయాలని స్పష్టం చేశారు. పూర్తి వివరాల కోసం ఫోన్ 9603557333, 8330967871 నంబర్లలో సంప్రదించాలని పిలుపునిచ్చారు.

నేడు లీడ్ ఇండియా శిక్షణ

విజయనగరం టౌన్: దేశం, సమాజం పట్ల, విద్యాపరంగా స్ఫూర్తిని నింపే క్రిటికల్ మాస్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను లీడ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. సోమవారం మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకూ జిల్లా పరిషత్ సెమినార్ హాల్లో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు లీడ్ ఇండియా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఎన్‌బి.సుదర్శనాచార్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

జననీ శిశు సురక్ష..
గర్భిణులకు రక్ష!



- గర్భిణులకు అండగా జననీ శిశు సురక్ష పథకం
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో పైసా ఖర్చు లేకుండా ప్రసవం
- గర్భిణుల కుటుంబాలకు ఆర్థిక ఆసరా కల్పిస్తున్న ప్రభుత్వం
- వైద్య పరీక్షలు, మందులకు అవసరమైనన్ని నిధులు
- నాలుగున్నరేళ్లలో 72,255 మందికి లబ్ధి



పెదమజ్జిపాలెం పీహెచ్‌సీకి వైద్య తనిఖీల కోసం వచ్చిన గర్భిణులు(ఫైల్)

విజయనగరం ఫోర్ట్: మాతాశిశు మరణాలు తగ్గించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోంది. దీనికోసం అనేకానేక పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. మహిళ కడుపులో బిడ్డ పడిన దగ్గర నుంచి ప్రసవమయ్యేంత వరకు, ఆ తర్వాత టీకాలు పూర్తయ్యే వరకు అన్నిసేవలను ఉచితంగానే అందిస్తున్నారు. ఇప్పుడు గర్భిణులకు తోడుగా జననీ శిశు సురక్ష పథకం అమలు చేస్తున్నారు. ఈ పథకం ద్వారా సిజేరియన్ సహా సుఖ ప్రసవం జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. అవసరమైన వారికి రక్తం, మందులు అందివ్వడంతో పాటు, వైద్య పరీక్షలు, వైద్య సేవలు అందిస్తున్నారు. వీటన్నింటి కోసం ప్రభుత్వం ఏటా లక్షలాది రూపాయాలు ఖర్చు చేస్తోంది. ఈ నేపథ్యంలో మాతాశిశు మరణాలు కూడా గణనీయంగా తగ్గడం శుభపరిణామం. గర్భిణులకు ఈ పథకం ఆసరాగా నిలుస్తుండడంతో వారంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

2019 నుంచి 2023 నవంబరు వరకు లబ్ధిదారుల వివరాలు

సంవత్సరం	లబ్ధిదారులు	వెచ్చించిన నిధులు
2019-20	19,688	రూ.59,06,400
2020-21	18,710	రూ.56,13,000
2021-22	17,881	రూ.53,64,300
2022-23	9,706	రూ.29,11,800
2023-24	6,270	రూ.18,89,000

జననీ శిశు సురక్ష సేవలు..

గర్భం దాల్చిన వెంటనే మహిళలను ఏఎన్ఎం రిజిస్టర్ చేస్తారు. ఆ తర్వాత హెచ్‌బీ(హిమోగ్లోబిన్) పరీక్ష చేస్తారు. రక్తం తక్కువగా (హెచ్‌బీ 9 నుంచి 10 గ్రాములు ఉంటే) వారికి ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు అందజేస్తారు. 6 నుంచి 7 గ్రాముల హెచ్‌బీ ఉన్న వారికి రక్తం, 8 గ్రాముల హెచ్‌బీ ఉన్న వారికి రక్తం పెరిగేందుకు పీహెచ్‌సీల్లోనే సుక్రోజ్ ఇంజెక్షన్లు ఇస్తారు. పీహెచ్‌సీలో లేని వైద్యపరీక్షలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేయించుకుంటే వాటికి కూడా జననీ శిశు సురక్ష పథకం ద్వారా డబ్బులు చెల్లిస్తారు. అలాగే పీహెచ్‌సీలో లేని మందులను బయట కొనుగోలు చేసినా వాటికి కూడా నగదు ఇస్తారు. గర్భిణిని ప్రసవానికి పీహెచ్‌సీ నుంచి జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేసినా వాటికి అయ్యే రవాణా ఖర్చు కూడా చెల్లిస్తారు. రక్తం ఎక్కించాల్సిన గర్భిణికి రక్తం కొనుగోలుకు కూడా డబ్బులు ఇవ్వడం జరుగుతుంది.

సుఖప్రసవం అయ్యేలా చర్యలు

ప్రభుత్వం ప్రవేశపెట్టిన జననీ శిశు సురక్ష పథకం గర్భిణులకు ఓ వరం. వారు సుఖ ప్రసవం అయ్యేలా అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నారు. రక్తం, మందుల పంపిణీ దగ్గర నుంచి వైద్యపరీక్షలు, వైద్యసేవలు అందిస్తున్నారు. ఫలితంగా గర్భిణులు, బాలింతలు, శిశువు ఆరోగ్యం పరిరక్షించడం జరుగుతోంది.

–ఎస్.భాస్కరరావు, డీఎంహెచ్‌వో, విజయనగరం.

నాలుగున్నరేళ్లలో 72,255 మందికి లబ్ధి..

ఈ నాలుగున్నరేళ్లలో జననీ శిశు సురక్ష పథకం ద్వారా జిల్లాలో 72,255 మంది లబ్ధి పొందారు. దీనికోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేసింది. 2019 నుంచి ఇప్పటివరకు గర్భిణుల సేవల కోసం రూ.2.16 కోట్లను ప్రభుత్వం వెచ్చించింది.

నిరుపేదలకు అండగా ధీర ఫౌండేషన్



కుట్టుమిషన్ శిక్షణార్థులతో మాజీ ఎంపీ ఝాన్సీలక్ష్మి, సందీప్, పూజిత

- మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి

విజయనగరం టౌన్: నిరుపేదలకు అండగా ధీర ఫౌండేషన్ నిలుస్తోందని మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి అన్నారు. ఆదివారం స్థానిక తోటపాలెం సత్య డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ధీర ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు నెలల పాటు కుట్టుమిషన్ శిక్షణ పొందిన 60 మంది అభ్యర్థులకు ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ బొత్స సందీప్, ఆయన సతీమణి పూజితలు బొత్స ఝాన్సీలక్ష్మి చేతులమీదుగా సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడేళ్లుగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, ఎంతోమందికి సహాయ, సహకారాలు ఫౌండేషన్ ద్వారా అందించడం అభినందనీయమన్నారు. పేదలకు సేవలందించడంలో తమవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని సందీప్ అన్నారు. మహిళల ఉజ్వల భవిష్యత్‌కు ధీర ఫౌండేషన్ కృషి చేస్తుందని పూజిత తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎం.శశిభూషణరావు, ప్రిన్సిపాల్ ఎం.వి.సాయిదేవమణి పాల్గొన్నారు.

అరుదైన ఫిషర్ కింగ్ క్యాట్ మృతి



ప్రమాదంలో మృతి చెందిన ఫిషర్ కింగ్ క్యాట్



ఫారెస్ట్ రేంజర్ సమక్షంలో పోస్టుమార్టం నిర్వహిస్తున్న పశువైద్యాధికారిణి హిరణ్య

రామభద్రపురం: మండలంలోని తారాపురం సమీపంలో ఆదివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని, అరుదైన పిల్లి మృతి చెందింది. దీనిని అరుదైన ఫిషర్ కింగ్ క్యాట్(బావురా పిల్లి)గా గుర్తించారు. తొలుత ఇది చిరుతపులి పిల్ల అని సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం సాగింది. వాట్సాప్ గ్రూపులు, పలువురి ద్వారా సమాచారం అందుకున్న ఫారెస్ట్ రేంజర్ బి.అప్పలరాజు సిబ్బంది, స్థానిక పశువైద్యాధికారిణితో కలిసి హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని, పరిశీలించారు. చిరుతపులి పిల్ల కాదని ఫిషర్ కింగ్ క్యాట్‌గా నిర్ధారించారు. మృతి చెందిన పిల్లిని స్థానిక పశువైద్య కేంద్రానికి తరలించి, పశువైద్యాధికారిని హిరణ్య పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం ఫారెస్ట్ సిబ్బంది ఫిషర్‌కింగ్ క్యాట్‌కు దహనసంస్కారాలు చేశారు. ఫారెస్ట్ రేంజర్ అప్పలరాజు, పశువైద్య శాఖ ఏడీ విష్ణు మాట్లాడుతూ ఈ జంతువును ఫిషర్ కింగ్ క్యాట్‌గా పిలుస్తారని, ఇది అరుదైన పిల్లి జాతికి చెందిందని తెలిపారు. ఎక్కువగా ఇది అడవుల్లోని సెలయేర్ల వద్ద ఉంటూ చేపలను వేటాడతాయన్నారు. దీనివల్ల మనుషులకు ఎటువంటి హాని ఉండదన్నారు. గోదావరి జిల్లాల్లోని మడ అడవుల్లో వీటి సంతతి కనిపిస్తుందన్నారు. దీనికి పులిచారలు పోలిన చారలు ఉండడంతో చిరుతపులి పిల్ల అని ప్రజలు ఆందోళన చెందారన్నారు.

రైలు దిగుతుండగా ప్రమాదం

- రెండు కాళ్లు కోల్పోయిన ఆర్మీ ఆఫీసర్
- చీపురుపల్లి రైల్వేస్టేషన్‌లో ఘటన



క్షతగాత్రుడిని ఆస్పత్రికి అంబులెన్స్‌లో తీసుకువెళ్తున్న దృశ్యం

చీపురుపల్లి రూరల్: స్థానిక రైల్వేస్టేషన్‌లో రైలు దిగుతుండగా అంపోలు శ్రీనివాస్ అనే ఆర్మీ ఆఫీసర్ తన రెండు కాళ్లను కోల్పోయాడు. గరివిడి మండలం, తాటిగూడకు చెందిన ఈయన ఒడిశాలోని గోపాలపూర్‌లో ఆర్మీ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆదివారం గోపాల్‌పూర్ నుంచి తన పిల్లలను తీసుకుని, స్వగ్రామం తాటిగూడకు రైలులో బయలుదేరారు. పిల్లలను తాటిగూడలోని తన తల్లితండ్రుల వద్ద విడిచిపెట్టి, వెంటనే వెళ్లిపోవాలనే ఆలోచనతో భార్యను కూడా వెంట తీసుకురాలేదు. మధ్యాహ్న సమయంలో చీపురుపల్లి రైల్వే స్టేషన్ రాగానే పిల్లలు, బ్యాగుతో కలిసి, రైలు దిగిపోయారు. రైలులో మరిచిపోయిన మరో బ్యాగు తీసుకువచ్చేందుకు రైలు ఆయన ఎక్కగా, ఈలోపు రైలు కదిలింది. ఈ క్రమంలో రైలు దిగుతుండగా జరిగిన ప్రమాదంలో ఆయన తన రెండు కాళ్లు రైలు, ప్లాట్‌ఫాం మధ్య ఇరుక్కుని, విరిగిపోయినట్లు సమాచారం. వైద్యసేవల నిమిత్తం అతడిని 108 అంబులెన్స్‌లో విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది.

బీఎస్ఎన్ఎల్ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

విజయనగరం టౌన్: బీఎస్ఎన్ఎల్ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని ఆలిండియా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జి.భాస్కరరావు డిమాండ్ చేశారు. స్థానిక ఎన్ఎఫ్‌టీఈ కార్యాలయం ఆవరణలో బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ డే ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2017 నుంచి పెన్షన్ రివిజన్ చేయాల్సి ఉన్నప్పటికీ నేటికీ అమలుచేయకపోడం చాలా విచారకరమన్నారు.

గత 15 ఏళ్లుగా 60 ఏళ్ల నుంచి వందేళ్ల లోపు వయసున్న వారికి ఎటువంటి ఆర్థికసాయం అందించలేదన్నారు. ఏళ్ల తరబడి పాతుకుపోయిన సమస్యల పరిష్కారంపై ఇప్పటికైనా దృష్టిసారించాలన్నారు. బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ అమలుకు విశేష కృషి చేసిన ఓంప్రకాష్ గుప్తాకు కృతజ్ఞతలన్నారు. అనంతరం వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పండ్లు, భోజనం, దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో ఏపీ సహాయ సర్కిల్ కార్యదర్శి డి.సుబ్బారావు, కృష్ణమూర్తి, ఎం.నారాయణరావు, టి.ఎస్.ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

పల్లెకు పండగొచ్చింది..

పల్లెకు సంక్రాంతి పండగ కళ వచ్చేసింది. ఇప్పటికే చాలా గ్రామాల్లో హరిదాసుల సందడి మొదలైంది. రామనామం జపిస్తూ హరిదాసు వస్తున్నాడంటే చాలు.. సంక్రాంతి సంబరాలు మొదలైనట్టే. ఆదివారం రామభద్రపురం మండల కేంద్రంలోని చొక్కాపు వీధిలో హరిదాసు సందడి చేశారు. ఇంటింటికీ వెళ్తున్న ఆయన వెంట చిన్నారులు కేరింతలు కొడుతూ తిరిగారు. ఏటా ఖరీఫ్ పంటలు చేతికి రాగానే అన్నదాతలు ఎంతో సంతోషంగా ఈ పండగ జరుపుకుంటారు. ఇదే పండగలో కుల, మతాలతో సంబంధం లేకుండా అందరూ పాలుపంచుకోవడం విశేషం.

–రామభద్రపురం



అయ్యో పాపం

- వృద్ధుడిని వదిలించుకున్న కన్నపిల్లలు
- ఆదుకున్న జీవీఎంసీ ఏయూటీడీ సిబ్బంది



వృద్ధుడి వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఏయూటీడీ సిబ్బంది

అల్లిపురం: వయసులో ఉన్నప్పుడు సంపాదించాడు. పిల్లలను పెంచి, పెద్దచేశాడు. వారికి పెళ్లిళ్లు కూడా చేశాడు. ప్రస్తుతం ఆయన వయసు మళ్లింది. వయోభారంతో నడవలేని స్థితిలో ఉన్నాడు. దీంతో పిల్లలు వదిలించుకోవాలనుకున్నారు. రెండు రోజుల క్రితం రాత్రి సమయంలో ఆ వృద్ధుడిని తీసుకువచ్చి, జగదాంబ జంక్షన్‌లో సీఎంఆర్ జ్యూయలరీ వద్ద వదిలిపెట్టి వెళ్లిపోయారు. రెండు రోజులుగా చలిలో కదల్లేని స్థితిలో పడి ఉన్న ఆ వృద్ధుడి విషయాన్ని తెలుసుకున్న భీమ్‌నగర్ ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహం మేనేజర్ జ్యోతిర్మయి, తన సిబ్బందితో వెళ్లి, అతడిని తీసుకువచ్చి, ఆశ్రయం కల్పించారు. అతనికి సపర్యలు చేసి, అనంతరం వివరాలు అడిగి తెలుసుకున్నారు. తనది విజయనగరం గంటస్తంభం ప్రాంతమని ఆ వృద్ధుడు తెలిపాడు. దీంతో అయ్యో పాపమని విషయం తెలిసిన వారంతా సానుభూతి వ్యక్తం చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



సంఘటన స్థలంలో మృతి చెందిన వ్యక్తి

దత్తిరాజేరు: మండలంలోని మర్రివలస కూడలి వద్ద ఉన్న జాతీయ రహదారిలో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఇన్‌చార్జ్ ఎస్‌ఐ శిరీష తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, మృతదేహాన్ని గజపతినగరం సామాజిక ఆస్పత్రికి తరలించామన్నారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

హైలేసో..హైలేసో..!



చింతపల్లి సముద్ర తీరంలో వేట చేస్తున్న మత్స్యకారులు

పూసపాటిరేగ: సముద్రంలో వేటే జీవనాధారమైన మత్స్యకారులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఉదారంగా ఆదుకుంటున్నారు. ప్రకృతి వైపరీత్యాలు, వేట నిషేధ సమయంలో వేట సాగక చేతిలో చిల్లిగవ్వ లేక విలవిల్లాడే మత్స్యకారుల కుటుంబాలు వీధిన పడకుండా అండగా నిలబడుతున్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తొలి ఏడాది నుంచి మత్స్యకారులకు అండగా ఉంటున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహం, సహకారం ఉన్నా వాతావరణ ప్రతికూల పరిస్థితులు ఎక్కువగా ఉండడంతో వేట సాగక మత్స్యకారులు అవస్థలు పడుతున్నారు. తరచూ తుఫాన్లు వస్తూ జీవనభృతి కష్టం అవడంతో ప్రభుత్వమే వారిని ఆదుకుంటోంది. వేట సమయంలో మత్స్యారారులు వినియోగించే డీజిల్‌కు సబ్సిడీ అందజేస్తున్నారు. అలాగే వేట నిషేధసమయంలో మత్స్యకార భరో సా కింద రూ.10వేల సాయం అందిస్తున్నారు. ఇటీవలనే గంగపుత్రులకు ఐదవ ఏడాది ఆర్థిక సహాయం అందించారు. జిల్లాలోని పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో 27 కిలోమీటర్ల మేర తీరప్రాంతం విస్తరించి ఉంది. తీరం వెంబడి 19 మత్స్యకార గ్రామాల్లో 21 వేల మంది చేపలవేటపైనే ఆధార పడి జీవిస్తున్నారు. 584 సాంకేతిక బోట్లు, 274 సంప్రదాయ బోట్లలో జిల్లాలోని మత్స్యకారులు వేట సాగిస్తున్నారు. 21 ఏళ్ల నుంచి 60 ఏళ్ల లోపు మత్స్యకారులు అయి ఉండి ,ప్రతి నెలా ఇతర పింఛన్లు ఏవీ తీసుకోకుండా ఉన్న మత్స్యకారులను గుర్తించి మత్స్యకార భరోసా క్రింద ఏటా రూ.10 వేలు వంతున ప్రభుత్వం ఆర్థికసాయం అందజేస్తోంది. ఈ మేరకు జిల్లాలో 3.908 మత్స్యకారులు లబ్దిపొందుతున్నారు.

టీడీపీ హయాంలో అరకొరగా సాయం

గత ప్రభుత్వం టీడీపీ హయాంలో అర్హులైన మత్స్యకారులకు రూ.4 వేలు ఇస్తామని చెప్పి, అర్హత ఉన్నా కేవలం కొంతమందికి మాత్రమే పరిహారం ఇచ్చేవారు. మిగిలిన వారికి మొండి చేయి చూపించేవారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సచివాలయాల్లో ఫిషరీస్ ఉద్యోగిని నియమించడం ద్వారా మత్స్యకారులకు సబంధించిన సమగ్ర సమాచారం ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి నుంచి ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు. అర్హతే ప్రామాణికంగా నేరుగా లబ్దిదారుల ఇంటికి వలంటీర్ వెళ్లి వివరాలు సేకరించడంతో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ మత్స్యకార భరోసా సాయం అందుతోంది

యూడైస్‌ప్లస్‌తో పాఠశాలల అభివృద్ధి

- యూడైస్ ప్లస్ ద్వారా విద్యాసంస్థల సమగ్ర సమాచార సేకరణ
- సమాచారం ఆధారంగా సమగ్ర శిక్ష బడ్జెట్ రూపకల్పన
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించిన నిధులతో అభివృద్ధి పనులు
- ఈ నెల 21 వరకే ఆన్‌లైన్‌లో నమోదుకు గడువు



యూడైస్ ప్లస్ లోగో

రాజాం సిటీ: పాఠశాలల్లో విద్యాభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపకల్పనలో విద్యాశాఖ నిమగ్నమైంది. యూడైస్‌లో పొందుపరిచిన సమాచారం ఆధారంగానే పాఠశాలల్లో మౌలిక, భౌతిక అవసరాలకు ఏటా రూపొందిస్తున్న ప్రణాళికలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయిస్తాయి. ఇందులో భాగంగానే యూడైస్ ప్లస్(యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్) ద్వారా సమాచారాన్ని సేకరిస్తున్నారు. ఈ సమాచారం ఆధారంగానే 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి, జిల్లా సమగ్ర శిక్ష బడ్జెట్ రూపొందిస్తారు.

సమగ్ర సమాచారం ప్రాప్తికే నిధులు..

సాధారణంగా ఏటా రూపొందిస్తున్న ప్రణాళికల ఆధారంగానే పాఠశాలల్లో మౌలిక అవసరాలకు నిధులు కేటాయిస్తారు. పాఠశాలల నుంచి వచ్చే సమాచారమే నిధులు కేటాయించేందుకు ప్రాతిపదికగా నిలుస్తుంది. జిల్లాలో 1 నుంచి 10వ తరగతి వరకు 2,250 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. వీటితో పాటు ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల సమాచారాన్ని కూడా సేకరించే పనిలో విద్యాశాఖ అధికారులు నిమగ్నమయ్యారు. సేకరించిన సమాచారం ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. పాఠశాలలకు అవసరమైన ఉపాధ్యాయ పోస్టులు మంజూరు కావాలన్నా, ఉన్న పోస్టులకు రేషనలైజేషన్ చేయాలన్నా, నూతనంగా అదనపు తరగతి గదులు, తాగునీరు, వ్యక్తిగత మరుగుదొడ్లు, ర్యాంపులు, వంటగదులు, లేబరేటరీలు, ప్రత్యేకావసరాలు గల చిన్నారులకు ఉపకరణాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు వంటివి మంజూరు చేసేందుకు కేంద్రం యూడైస్ ప్లస్ ద్వారా పంపే సమాచారాన్ని ప్రాతిపదికగా తీసుకుంటుంది. ఆ తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏపీ సమగ్ర శిక్షకు నిధులు కేటాయిస్తాయి.

గతంలో మాన్యువల్‌గా..

జిల్లాలోని అన్ని పాఠశాలలు యూడైస్ ప్లస్‌లో సమాచారాన్ని పొందుపర్చేందుకు ఈ నెల 21వ తేదీ వరకు గడువు ఉంది. గతంలో యూడైస్ ప్లస్ సమాచార సేకరణ అంతా మాన్యువల్‌గా జరిగేది. అయితే మూడేళ్లుగా ఆన్‌లైన్‌లోనే సమాచారాన్ని సేకరిస్తున్నారు. పాఠశాల కేంద్రంగా సమాచారాన్ని హెచ్‌ఎంలు ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేస్తారు. ఈ సమాచారం నేరుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చేరుతుంది.

కళాశాలల సమాచారం సేకరించాం..

వచ్చే ఏడాది విద్యాసంవత్సరానికి సంబంధించి, కళాశాలల సమగ్ర సమాచారాన్ని యూడైస్ ప్లస్‌లో పొందుపర్చేలా అన్ని ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపాళ్లకు సూచించాం. ఈ నెల 21వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించాం.

–ఎం.ఆదినారాఆయణ, ఆర్ఐవో, విజయనగరం.

పూర్తిస్థాయి సమాచారం ఉండాలి..

పాఠశాలల హెచ్‌ఎంలు యూడైస్‌లో పొందుపరుస్తున్న సమాచారం పూర్తిస్థాయిలో ఉండాలి. ప్రత్యేకావసరాలు గల చిన్నారుల వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలి. క్షేత్రస్థాయిలో ఇచ్చిన ఇదే సమాచారం పాఠశాల అభివృద్ధికి కీలకంగా మారుతుంది.

–బి.లింగేశ్వరరెడ్డి, డీఈవో, విజయనగరం.